గ్రామీణ వైద్యం బలోపేతం

- నాడు–నేడుతో పీహెచ్‌సీలకు మహర్దశ
- కోట్లాది రూపాయలతో వసతులు
- పెరిగిన మౌలికసదుపాయాలు
- రోగులకు మెరుగైన వైద్యం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

ఇది కదా.. అభివృద్ధి



వత్సవాయిలో రూ.50 లక్షలతో నిర్మించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్

పెనుగంచిప్రోలు: గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లు ఉన్నా గతంలో ప్రజలకు వైద్యసేవలు అంతంతమాత్రంగా అందేవి. పీహెచ్‌సీల్లో సరైన వసతులు, మందులు, తగినంత మంది సిబ్బంది అందుబాటులో లేక రోగులు అనేక ఇబ్బందులు పడేవారు. 2019లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక ..రాష్ట్రంలో గ్రామీణవైద్య సేవలపై దృష్టి సారించారు. నాడు–నేడు ప్రణాళికలతో కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆధునీకరించారు. ప్రతి సచివాలయానికి అనుబంధంగా విలేజ్ క్లీనిక్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష పథకాల ద్వారా ప్రజలకు ఇంటి వద్దనే వైద్యాన్ని అందిస్తూ వైద్యశాఖ చరిత్రలో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు.

నూతన పీహెచ్‌సీల నిర్మాణం..

గ్రామీణ ప్రాంతాల్లో నివసించే పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు ఉన్నత స్థాయి వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఐదేళ్లుగా కృతనిశ్చయంతో పనిచేస్తోంది. ఇప్పటికే నాడు–నేడు పథకం ద్వారా పాత పీహెచ్‌సీలను ఆధునీకరించగా, అవసరమైన ప్రాంతాల్లో కొత్త పీహెచ్‌సీల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. జగ్గయ్యపేట నియోజకవర్గంలో పెనుగంచిప్రోలు, వత్సవాయితోపాటు జగ్గయ్యపేట మండలం బూచవరంలో పీహెచ్‌సీలు ఉండగా కొత్తగా జగ్గయ్యపేట మండలం గౌరవరం, నందిగామ మండలంలోని రామిరెడ్డిపల్లిలో నూతన పీహెచ్‌సీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రతి గ్రామంలో వైద్యాలయం ఉండాలని వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లను నిర్మిస్తున్నారు. ఇప్పటికే కొన్ని విలేజ్ క్లీనిక్‌లు పూర్తయి ప్రజలకు సేవలందిస్తుండగా మరికొన్ని నిర్మాణంలో ఉన్నాయి. ఆరోగ్య కేంద్రాల్లో మందుల కొరతలేకుండా చేశారు. వైద్యులతోపాటు సిబ్బంది అందుబాటులో ఉంటుండటంపై గ్రామీణప్రాంత ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.


రూ20లక్షలతో అభివృద్ధి చేసిన బూచవరంలోని పీహెచ్‌సీ


పెనుగంచిప్రోలులో ఆధునీకరించిన పీహెచ్‌సీ భవనం

రూ.45లక్షలతో పీహెచ్‌సీ ఆధునీకరణ....

నాడు–నేడు కింద పెనుగంచిప్రోలు పీహెచ్‌సీని సుమారు రూ.45 లక్షలతో ఆధునీకరించారు. రోగులకు అవసరమైన పరికరాలతో పాటు పాత, కొత్త భవనాలకు మరమ్మతులు చేపట్టారు. రంగులు, ఎలక్ట్రిఫికేషన్, డెలివరీ గదిలో సింక్‌లు, టైల్స్, పైపులైన్, టాయిలెట్స్ , రన్నింగ్ వాటర్ వంటి సదుపాయాలు కల్పించారు.

వత్సవాయిలో రూ.50 లక్షలతో..

వత్సవాయి పీహెచ్‌సీలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.50లక్షలతో బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ ఏర్పాటు చేశారు. ఇప్పటికే పీహెచ్‌సీల్లో 67రకాల పరీక్షలు నిర్వహిస్తుండగా, ఇంకా అత్యవసరమైన పరీక్షలు నిర్వహించేందుకు ఈ యూనిట్‌లో ల్యాబ్ ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన పరికరాలు వచ్చాయి. కొద్ది రోజుల్లో ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలు అందిస్తామని వైద్యులు చెబుతున్నారు. నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా సుమారు రూ.30 లక్షలతో భవన మరమ్మతులు, ఫర్నీచర్, ఓవర్‌హెడ్ ట్యాంక్ ఏర్పాటు చేశారు.

జగనన్న సురక్ష ద్వారా..

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేస్తుండటంతోపాటు మందులను పంపిణీ చేస్తున్నారు. ఇక సుమారు 3వేలకుపైగా వ్యాధులకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ద్వారా రూ.25లక్షల వరకు అయ్యే వైద్యాన్ని పేదలకు ఉచితంగా అందిస్తున్నారు.

బూచవరంలో రూ.20లక్షలతో..

జగ్గయ్యపేట మండలంలోని బూచవరం పీహెచ్‌సీలో నాడు–నేడు పథకంలో భాగంగా సుమారు రూ.20లక్షలతో మౌలిక వసతులు కల్పించారు. భవనానికి మరమ్మతులు సీసీ రోడ్డు, కాలువ నిర్మాణంతోపాటు బోరు, రన్నింగ్ వాటర్, ఫర్నీచర్ ఏర్పాటు చేశారు. ఇలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం జగ్గయ్యపేట నియోజకవర్గంలోని ఆయా పీహెచ్‌సీల్లో మౌలికవసతుల కల్పనకు కోట్లాది రూపాయలను ఖర్చుచేయడంతో పాటు విలేజ్ క్లీనిక్‌ల ఏర్పాటుతో గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలను ప్రజలకు మరింత చేరువ చేశారనే చెప్పవచ్చు. వైద్యం కోసం అనేక వ్యయప్రయాసల కోర్చి సుదూరప్రాంతాలకు వెళ్లే పనిలేకుండా స్థానికంగానే పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందుతుండటంపై జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

నాణ్యమైన వైద్యసేవలు..



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వచ్చాక ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయి. పీహెచ్‌సీలతోపాటు గ్రామాల్లోని హెల్త్ క్లీనిక్‌లో కూడా అన్ని రకాల మందులు అందుబాటులో ఉంటున్నాయి. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఆరోగ్యశ్రీద్వారా సేవలు అందిస్తున్నారు. నాకు మోకాలు ఆపరేషన్‌కు తిరుపతిలో చేయించుకుంటే మొత్తం ఉచితంగానే చేశారు.

– కె రాంబాబు, అనిగండ్లపాడు

వసతులు సమకూర్చారు..



గతంలో పీహెచ్‌సీలో కూర్చునేందుకు కూడా వసతి లేదు. గర్భిణులు టాయెలట్‌కు వెళ్లాలన్నా ఇబ్బంది పడేవారు. నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రిలో అన్నిరకాల వసతులు కల్పించారు. పీహెచ్‌సీలో మందులు కూడా పూర్తిగా అందుబాటులోకి వచ్చాయి. ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– రామసాని పద్మ, పెనుగంచిప్రోలు

క్లుప్తంగా

ఘనంగా ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని 31వ వార్డు, శాంతినగర్‌లో వేంచేసియున్న శ్రీచింతామణి అభయాంజనేయస్వామి ఆలయంలో కీర్తి ధ్వజ, నవగ్రహ పునఃప్రతిష్ఠా మహోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పరాశరం సురేష్ ఆచార్యులు పర్యవేక్షణలో ఆలయ పురోహితులు జొన్నాభట్ల సతీష్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ ప్రతిష్ఠాపన మహోత్సవంలో విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను దంపతులు పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఇంటూరి రాజగోపాల్(చిన్నా), 31వ వార్డు సచివాలయం కన్వీనర్ గింజుపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల జాబితా



జగ్గయ్యపేట: ఓటర్ల తుదిజాబితాను ఎన్నికల సంఘం ప్రకటించిన నేపథ్యంలో జగ్గయ్యపేట ఎన్నికల సిబ్బంది నియోజకవర్గ ఓటర్ల జాబితాను పోలింగ్ కేంద్రాల వారీగా సిద్ధం చేసే పనిలో నిమగ్నమైంది. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల జాబితాను తయారుచేసే పనిలో సిబ్బంది ఉన్నారు. ఈప్రక్రియను ఆర్వో జి.వెంకటేశ్వర్లు పరిశీలించారు. నియోజకవర్గంలో 222 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ఓటర్లు 2,05,364 మంది ఉన్నారు. రెండు రోజుల్లో ఓటర్ల జాబితాను బీఎల్‌వోలకు అందించనున్నట్లు ఆర్వో తెలిపారు.

నందిగామలో పోలీస్ కవాతు



నందిగామ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నందిగామ పట్టణంలో ఆదివారం రాత్రి ప్రత్యేక పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా గాంధీ సెంటర్‌లో నందిగామ ఇన్‌స్పెక్టర్ హనీష్, పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం పట్టణంలోని అన్ని ప్రధాన కూడళ్లలో ప్రత్యేక బలగాలతో కవాతు నిర్వహించారు. ఎన్నికల్లో ప్రజలు ప్రశాంతంగా ఓటుహక్కును వినియోగించుకునేలా వారిలో మనోధైర్యాన్ని నింపేందుకు ఈ కవాతు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు.

267 మద్యం సీసాలు స్వాధీనం

జగ్గయ్యపేట: ఓ ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఈబీ సీఐ మణికంఠరెడ్డి ఆదివారం తెలిపారు. మండలంలోని చిల్లకల్లు గ్రామంలో మద్యం అక్రమంగా నిల్వచేసినట్లు సమాచారం అందడంతో ఎస్‌ఈబీ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు సీఐ వివరించారు. గ్రామానికి చెందిన గొట్టెముక్కల పార్వతి నివాసంలో 267 మద్యం సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మద్యం సీసాలను గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావు, పీట్ల వెంకటేశ్వరరావు సరఫరా చేసినట్లు తమ విచారణలో తేలిందన్నారు. ఈ కేసుకు సంబంధించి సదరు మహిళను అదుపులోకి తీసుకోగా, మిగిలిన ఇద్దరు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు.

చంద్రబాబువి మోసపూరిత మాటలు

నందిగామ: టీడీపీ అధినేత చంద్రబాబుకు ఒంటరిగా పోటీ చేసే ధైర్యం లేకే బీజేపీ, జనసేన పార్టీలతో కూటమి ఏర్పాటు చేసుకున్నారని వైఎస్సార్ సిపి లీగల్ సెల్ నియోజకవర్గ కన్వీనర్ అద్దంకి మణిబాబు ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. చంద్రబాబు తన మోసపూరిత వాగ్దానాలతో రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చి ఎన్నికల్లో ప్రజల ముందుకొచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి గెలిపించుకోవడానికి రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని మణిబాబు పేర్కొన్నారు.

పోలీసు కమిషనర్ ఆకస్మిక తనిఖీ



నందిగామ: విధి నిర్వహణలో పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్(సీపీ) పీహెచ్‌డి రామకృష్ణ సూచించారు. నందిగామ పోలీస్‌స్టేషన్‌ను ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులు పరిశీలించారు. అనంతరం పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని, కెవిఆర్ కాలేజ్ లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా సీపీ రామకృష్ణ మాట్లాడుతూ విధి నిర్వహణలో అలసత్వం వహించే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఏసీపీ డాక్టర్ రవికిరణ్, ఇన్‌స్పెక్టర్ హనీష్ ఉన్నారు.

వైభవంగా స్వామివారి కల్యాణం



నందిగామ: మండలంలోని దాములూరు కూడలి సంగమేశ్వరస్వామి వారి ఆలయ సమీపంలో నిర్మించిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయ రెండో వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు చేశారు. అనంతరం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అర్చకుడు దాములూరి శ్రీనివాస శర్మ పర్యవేక్షణలో నిర్వహించిన స్వామివారి కల్యాణోత్సంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జగనన్న చెప్పారంటే..చేస్తారంతే

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

వీరులపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో 99శాతం హామీలను అమలుచేయడం ద్వారా చెప్పారంటే.. చేస్తారనేలా పేరు తెచ్చుకున్నారని నందిగామ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని బోడవాడ, జమ్మవరం, పొన్నవరం, జగన్నాథపురం, నరసింహారావుపాలెం గ్రామాల్లో ఆదివారం రాత్రి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. రానున్న ఎన్నికలలో సైతం ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎంపీ అభ్యర్థిగా కేశినేని నానిని, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. ప్రచారంలో భాగంగా గ్రామానికి వచ్చిన జగన్‌మోహనరావుకు మహిళలు హారతులిచ్చి ఘనస్వాగతం పలికారు. తొలుత ఆయన బోడవాడ, జమ్మవరం గ్రామాల్లోని పరిశుద్ధ లూర్ధుమాత ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగా డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. సీఎం జగనన్న ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టో నిరుపేదల పాలిట వరమని అభివర్ణించారు. చంద్రబాబు మాదిరిగా అమలుకు నోచుకోని హామీలిచ్చి ప్రజలను మోసం చేయడం జగన్‌మోహన్‌రెడ్డికి చేతకాదన్నారు. అమలుచేయగలిగిన అంశాలనే మేనిఫెస్టోలో ప్రకటించారని గుర్తుచేశారు. ప్రచారంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి., పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, కాపు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్లు బొమ్మిశెట్టి భాస్కరరావు, షహనాజ్ బేగం, సర్పంచ్‌లు శీలం సంధ్య, షోడగిరి రాజశ్రీ, బండి విజయ్ పాల్‌రెడ్డి, బొమ్మిశెట్టి దుర్గాదేవి, ఎంపీటీసీ సభ్యులు యాదాల సుజాత, శీలం రమణారెడ్డి, నాయకులు నువ్వుల విశ్వనాథం, , పూలా రాంబాబు, యాదాల దాసు, కర్ల రాజు , పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.


బోడవాడ జమ్మవరంలో జగన్‌మోహనరావుకు హారతిచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు


బోడవాడలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

జగనన్నతోనే పేదలకు భరోసా

కంచికచర్ల : రాష్ట్రంలోని పేదల జీవితాలకు ఈ ఐదేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓ భరోసా కల్పించారని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. కంచికచర్ల వసంతకాలనీలో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తనను, విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని)ని గెలిపించాలని ఓటర్లను కోరారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఆయనకు వసంతకాలనీ మహిళలు గుమ్మడికాయలతో దిష్టిచేయడంతోపాటు హారతులిచ్చి ఆత్మీయస్వాగతం పలికారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ వసంతకాలనీలో 33కేవీ హైటెన్షన్ విద్యుత్ వైర్ల సమస్యను నాలుగు దశాబ్దాలుగా ఎవ్వరూ పట్టించుకోకపోతే తమ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పరిష్కరించిదని గుర్తుచేశారు. రాష్ట్రంలో పేదల జీవన ప్రమాణాల పెంపునకు సీఎం జగన్ గట్టిపునాదులు వేశారని, ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయన్నారు. సీఎం జగనన్న మరోసారి ముఖ్యమంత్రి కావాల్సి ఉందని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు నన్నపనేని నరసింహారావు, వేమా సురేష్ బాబు, ఏఎంసీ వైస్‌చైర్మన్ మాడుగుల శంకర్, ఎంపీటీసీ సభ్యులు గుగులోతు ఇందిర, సొసైటీ అధ్యక్షుడు కాలవ పెదబాబు, నాయకులు దాసరి రాము, నంబూరు నరసింహారావు, అమర్లపూడి యోహాన్, ఉప్పు స్వామి, గ్రంధి ఆదిత్య, తంగిరాల సృజీనీకుమార్, గుగులోతు శివకుమార్, కావాటి రాంబాబు, బడేటి మల్లి, గోగినేని వెంకటేశ్వరరావు, నారిశెట్టి శ్రీనివాసరావు, ఓర్సు నరసింహారావు పాల్గొన్నారు.


కంచికచర్లలో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

పద్మశాలీల సంక్షేమానికి కృషి


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను ఉదయభాను

విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్రంలో పద్మశాలీల సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను అన్నారు. స్థానిక జేఆర్‌సీ కళాశాల రోడ్డులోని ఎస్ఎల్ఎస్ ఫంక్షన్ హాలులో ఆదివారం రాత్రి పేట నియోజకవర్గ పద్మశాలీల ఆత్మీయ సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన విప్ ఉదయభాను మాట్లాడుతూ పద్మశాలీల సంక్షేమానికి తాను చేసిన కృషిని వివరించారు. రాజకీయంగా గతంలో వత్సవాయి ఎంపీపీ పదవితోపాటు పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్ష పదవి, ప్రస్తుతం పెనుగంచిప్రోలు తిరుపతమ్మ దేవస్థానం డైరెక్టర్, పేట మార్కెట్ యార్డు డైరెక్టర్, వత్సవాయి ఎంపీటీసీగా పద్మశాలీలకు అవకాశాలు కల్పించినట్లు చెప్పారు. ఇప్పటికే పేటలో రూ.20లక్షలతో స్మశానవాటిక అభివృద్ధి చేసినట్లు తెలిపారు. పేటలో పద్మశాలీల కోసం కల్యాణ మండపం నిర్మిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ పెంటి శ్రీనివాసరావుతోపాటు పలువురు పద్మశాలీ సంఘ నాయకులను ఉదయభాను ఘనంగా సత్కరించారు. విప్ ఉదయభానును పద్మశాలీల నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పద్మశాలీల సంఘం కోస్తా జిల్లాల చైర్మన్ కోసూరి సుబ్రహ్మణ్యం, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ వాసపల్లి త్రిమూర్తులు, మున్సిపల్ చైర్మన్ ఆర్.రాఘవేంద్ర, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు మునిని రాజ్యలక్ష్మి, వత్సవాయి ఎంపీటీసీ సభ్యురాలు మెటికోలు అనురాధ, ఏఎంసీ డైరెక్టర్ గోలి రామేశ్వరి, పద్మశాలీ సంఘం పేట పట్టణ అధ్యక్షుడు పెనుమల్లి చంద్రమౌళి, పద్మశాలీ సంఘం పేట నియోజకవర్గం గౌరవాధ్యక్షుడు యేశాల సీతారామమూర్తి, చేనేత విభాగం పేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల అధ్యక్షులు దేవరశెట్టి వీరాంజనేయులు, గొట్టిముక్కల బుచ్చిబాబు, యేశాల కనకచంద్రరావు, గుడ్ల రామారావు పాల్గొన్నారు.

అందరికీ మేలు చేసేలా మేనిఫెస్టో

పెనుగంచిప్రోలు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేసిన మేనిఫెస్టో రాష్ట్రంలో అన్ని వర్గాలకు మేలు చేసేలా ఉందని సర్పంచి వేల్పుల పద్మకుమారి అన్నారు. వైఎస్సార్ సీపీ విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, జగ్గయ్యపేట ఎమ్మెల్యే అభ్యర్థి సామినేని ఉదయభానును అఖండమైన మెజార్టీతో గెలిపించాలని కోరుతూ పెనుగంచిప్రోలులో ఆదివారం ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా పద్మకుమారి మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కరోనా కష్టకాలంలో కూడా 99 శాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. సీఎం జగన్ మాట ఇచ్చాడంటే ప్రతి హామీని నెరవేర్చుతారని ప్రజలు బలంగా నమ్ముతారన్నారు. చంద్రబాబులాగా బూటకపు హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేయడం జగనన్నకు తెలియదన్నారు. ఈఐదేళ్లలో ఇచ్చిన మాటలను నిలుపుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో పూసల కార్పొరేషన్ డైరెక్టర్ చేని కుమారి, సొసైటీ అధ్యక్షులు గింజుపల్లి నరసింహారావు, నాయకులు పచ్చల శివప్రసాద్, కోటిరెడ్డి, చేని రాంబాబు, కాకాని గోపయ్య, కాకాని పద్మ, బొమ్మి రాణి, జొన్నలగడ్డ పద్మజ పాల్గొన్నారు.


ప్రచారంలో సర్పంచి పద్మకుమారి, చేని కుమారి, నాయకులు

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



పెనుగంచిప్రోలు:గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. భక్తులు పాలుపొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం వేళ మునేరు అవతల మామిడితోటల్లో సేదతీరారు. ఆలయ అధికారులు, గుంటూరుకు చెందిన యలమంచలి అభిరామ్ సౌజన్యంతో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా



కంచికచర్ల : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వలంటీర్ల సేవలను అడ్డుకోవాలంటూ రాష్ట్ర ఎన్నికల మాజీ కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ నేతృత్వంలో సిటిజన్ ఫర్ డెమొక్రసీ సంస్థ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడాన్ని నిరసిస్తూ కంచికచర్ల సచివాలయం–2లో పనిచేస్తున్న 20మంది వలంటీర్లు ఆదివారం తమ విధులకు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. ఈ మేరకు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవోకు సోమవారం అందజేయనున్నట్లు తెలిపారు. సచివాలయ పరిధిలో ఐదేళ్లుగా వలంటీర్లుగా ప్రజలకు సేవలందిస్తున్న తమపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం ఎంతవరకు సమంజసమని వలంటీర్లు ప్రశ్నించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ముసుగులో కొందరు వ్యక్తులు ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతున్న వైనాన్ని ప్రజలు గమనించాలని వలంటీర్లు కోరారు.

వైఎస్సార్ సీపీతోనే పేదలకు మేలు


వత్సవాయిలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ కొలుసు రమాదేవి, నాయకులు

వత్సవాయి : రాష్ట్రంలోముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ద్వారానే పేదలకు మేలు చేకూరుతోందని ఎంపీపీ కొలుసు రమాదేవి, జెడ్పీటీసీ యేశపోగు దేవమణి అన్నారు. వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట ఎమ్మెల్యే అభ్యర్థి సామినేని ఉదయభాను. విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని) విజయాన్ని కోరుతూ వత్సవాయిలో ఆదివారం వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఈ ఐదేళ్లలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఎంపీపీ, జెడ్పీటీసీలు మాట్లాడుతూ ఇచ్చిన హామీల్లో 99శాతం హామీలను నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. చంద్రబాబులాగా ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కే అలవాటు సీఎం జగనన్నకు లేదని ప్రజలు బలంగా నమ్ముతున్నారని వివరించారు. సర్పంచి భూక్యా సీతమ్మ, సొసైటీ అధ్యక్షులు రంగిశెట్టి ముత్తయ్య, వైస్ ఎంపీపీ కొలికపోగు వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షులు గుత్తా శంకరరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి గాదెల రామారావు పాల్గొన్నారు.